www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 10 మే 2025
5
కాకినాడ



వృద్ధురాలితో డిప్యూటీ సిఎం భోజనం

యు.కొత్తపల్లి: మండలంలోని కొత్త ఇసుకపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు పోతుల పేరంటాలుతో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కలిసి శుక్రవారం భోజనం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయం సాధిస్తే వేగుళ్లమ్మకు గరగ చేయిస్తానని పేరంటాలు మొక్కుకున్నారు. రూ.27 వేలతో గరగ చేయించిన ఆమె పవన్ కళ్యాణ్‌తో కలిసి భోజనం చేయాలని ఉందని స్థానికులకు తెలపడంతో జనసేన నాయకులు డిప్యూటీ సిఎం పవన్‌కు తెలిపారు. దీంతో ఆయన ఆమెను శుక్రవారం విజయవాడకు రప్పించి ఆమెతో కలిసి భోజనం చేశారు. అనంతరం లక్ష రూపాయలు విలువ చేసే చీరను వృద్ధురాలికి బహుకరించారు.


వృద్ధురాలితో భోజనం చేస్తున్న పవన్

ఆశాలకు కనీస వేతనాలేవీ..

- వయో పరిమితి పెంపు, ప్రసూతి సెలవులు నిల్
- హామీలను మరచిన కూటమి ప్రభుత్వం
- దశల వారీగా పోరాటాలకు సిద్ధం
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జాబ్ ఛార్ట్‌లో లేని పనులను సైతం చేస్తూ వైద్య ఆరోగ్య సేవల్లో కీలకపాత్ర వహిస్తున్న ఆశా వర్కర్లు అనేక ఏళ్లుగా సమస్యలతో సతమతం అవుతున్నారు. కనీస వేతనాలు లేక కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిరంతరం వీరి సేవలను వినియోగించుకుంటున్న సర్కారు సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఏ ప్రభుత్వం మారినా కొత్త సీసాలో పాత నీరు మాదిరిగా సమస్యలను పరిష్కరించడంలో మాత్రం చొరవ చూపడం లేదు. గత సర్కారు కనీస వేతనాలను అమలు చేస్తామని, ప్రసూతి సెలవులు ఇవ్వడంతో పాటు వయోపరిమితిని పెంచి అమలు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేకపోయింది. ఎన్నికల్లో లబ్ధి కోసం కూటమి పార్టీలు ఆశా వర్కర్లకు సైతం పలు హామీలను ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ వాగ్దానాలను అమలు చేస్తామంటూ చెప్పుకొచ్చారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు సర్కారు నేడు నోరు మెదపడం లేదు. ఈ నేపథ్యంలో ఆశా వర్కర్లు తమ న్యాయమైన కోర్కెలను సాధించుకోవడం కోసం దశలవారీగా ఆందోళనకు సిద్ధపడుతున్నారు.

కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. మాతా శిశ మరణాలను తగ్గించేందుకు కృషి, ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సాహించడం ఇలా అనేక పనులు చేస్తున్నారు. అయితే వీరికి కనీస వేతనాలు కరువయ్యాయి. దీంతో గతంలో జరిపిన అనేక పోరాటాల నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. వర్కర్లకు మట్టి ఖర్చులుగా రూ.20 వేలు, వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచుతామని, 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తామని, పిఎం జెజెవై పథకంలో భాగంగా సర్వీసులో ఉండగా మరణిస్తే రూ.2 లక్షలు, ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే రూ.6 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్‌గా రూ.60 వేలు ఇస్తామని నమ్మబలికి చివరకు అధికారం కోల్పోయింది. ఇదే సమయంలో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశలకు గ్రాడ్యుటీ అమలు చేస్తామని, ప్రసూతి సెలవులు ఇస్తామని, వయో పరిమితి పెంచుతామని చెప్పుకొచ్చారు. వేతనాలు కూడా పెంచుతామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో ఒప్పందం చేసుకుంది. అయినా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడంతో మరోసారి ఆశాలు ఆందోళన చేయగా ఈ ఏడాది మళ్లీ రెండు నెలల క్రితం మరోసారి హామీ ఇచ్చింది. వీటికి మినిట్స్ కూడా నమోదు చేశారు. కానీ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ సర్కారు బోడి మల్లయ్య చందాన వ్యవహరిస్తున్నట్లుగా ఆశాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నల్ల రిబ్బన్లతో నిరసనలో తెలుపుతున్న ఆశా వర్కర్లు (ఫైల్ ఫొటో)

మరోసారి ఆందోళనకు సిద్ధం

ఒప్పంద హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశాలు మరోసారి ఆందోళనకు సిద్ధపడుతున్నారు. ఈ నెల 6న నల్ల రిబ్బన్లతో నిరసన చేస్తూ విధులకు హాజరయ్యారు. తమ డిమాండ్లను అధికారులకు విన్నవిస్తున్నారు. వివిధ డిమాండ్ల సాధనకు ఈ నెల 20 జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నారు. తమను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. దశలవారీగా ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన తరుణంలో జూన్, జూలై నెలల్లో టోకెన్ సమ్మెలో భాగంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, పిహెచ్‌సిలు, జిల్లా కలెక్టరేట్ల వద్ద జరగనున్న సమ్మెలో పాల్గొంటారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టులో నిరవధిక సమ్మెలోకి వెళ్లే ఆలోచనలో ఆశాలు అడుగులు వేస్తున్నారు.



హామీలను తక్షణం అమలు చేయాలి

గత ప్రభుత్వ విధానాలను దుమ్మెత్తి పోసిన కూటమి పెద్దలు ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. నీతులు చెప్పడమే కాక వాటిని పాటించే విధంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేయాలి. ఇప్పటికే తీవ్ర పని ఒత్తిళ్ళ నడుమ కనీస వేతనాలు అందక, ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అమలు కాక, వయోపరిమితి పెంచక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రతిఘటన తప్పదు.

-చంద్రమళ్ల పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ.

పసరు నీరు రాకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిలో ఆకుపసర నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఉండూరు రోడ్ లోని ఫిల్టర్ బెడ్ మంచి నీటి చెరువులో, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి కాలువ ద్వారా సేకరిస్తున్న ముడి జలాల స్థాయిని, ఫిల్టర్ బెడ్‌లో జలాలు శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆకస్మిక వర్షాలు కారణంగా జలాల కలుషితమై గత రెండు రోజులుగా ఆకుపసరుగా నీటి సరఫరా అవుతుందని, ఆ పరిస్థితి లేకుండా పరిశుభ్రమైన నీరు అందించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో డిఇ శ్రీధర్, ఎఇ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య


అభ్యర్థులకు అందజేసే మెటీరియల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

13న డిఎస్‌సిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 13న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఎస్‌సి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ నాయకత్వం వెల్లడించింది. శుక్రవారం స్థానిక యుటిఎఫ్ హోంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవి చక్రవర్తి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలను నిర్దేశించుకున్న యుటిఎఫ్ ఉపాధ్యాయుల శ్రేయస్సు, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ కోసం కృషి చేస్తుందన్నారు. అలాగే సామాజిక సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. దీనిలోభాగంగానే డిఎస్‌సికి సిద్ధపడుతున్న అభ్యర్థులకు ఈనెల 13వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగరంలోని సూర్యకళామందిరంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సులో పోటీ పరీక్షల శిక్షణా నిపుణులు, పూర్వ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, ఆయన బృందం హాజరై వివిధ అంశాలను బోధిస్తారని తెలిపారు. అదేవిధంగా సదస్సుకి హాజరైన అభ్యర్థులకు లక్ష్మణరావు సౌజన్యంతో రూపొందించిన విద్యా మనో విజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ బుక్‌ను వారు ఆవిష్కరించారు. ఇతర వివరాలకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.రామలక్ష్మి (9959562666), కె.పెద్దిరాజు(9652677889)లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవివి.నగేష్, నాయకులు కె.ఈశ్వరరావు, కాంట్రాక్టు లెక్చరర్ల సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మాణిక్యం పాల్గొన్నారు.

అంబేద్కర్ నాటక ప్రదర్శనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - రౌతులపూడి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జీవిత చిత్రం, కళా రూపం నాటకం ప్రదర్శనను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్, కెవిపిఎస్ నాయకులు సింహాచలం పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజమే తన కుటుంబంగా భావించి కన్నబిడ్డ చావును లెక్కచేయని మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. సమాజాభివృద్ధే లక్ష్యంగా భారత రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. డాక్టర్ అంబేద్కర్ జీవిత చరిత్రను కెవిపిఎస్ సహకారంతో 'సంగం శరణం గచ్ఛామి' అనే కళారూపం ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ జీవిత చరిత్రను సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీన రౌతులపూడిలోని శ్రీ సాయి సూర్య ఏజెన్సీస్ పెట్రోల్ బంక్ రోడ్లో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు, యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సింహాచలం, బి.తాతబాబు, బర్రె రాజేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గంగ సూరిబాబు పాల్గొన్నారు.


అంబేద్కర్ జీవిత చిత్రం ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమ్మె జయప్రదానికి పిలుపు

ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు మండలంలోని శీలలంక, మంజేరు, శీల, చేదువాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ కూలీలను ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం శ్రమజీవులను అణగదొక్కే కొత్త కొత్త చట్టాల ను తీసుకొస్తూ కార్మికులపై పని భారం పెంచు తుందన్నారు. కార్మిక హక్కులను హరించేలా 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో బుడితి ప్రభాకర్‌రావు, ఇసుకపట్ల సుబ్రహ్మణ్యం, మాక రామారావు, నందిక ఇమ్మానుయేలు, పువ్వల భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ** ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు వీలుగా కాకినాడ రైల్వే శాఖ ఎస్ఎస్ఇ రవికృష్ణకు రైల్వే కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నర్సింహులు, సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ సమ్మె నోటీసు అందించారు. ఈ నెల 20న జరుగుతున్న సమ్మెలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు పాల్గొనేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా స్వచ్ఛందంగా వచ్చి సమ్మె ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. **గొల్లప్రోలు** కార్మికుల అందరికీ కనీస వేతనం ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్స్ అందరినీ కార్మికులుగా గుర్తించాలని కోరుతూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంచపు సత్తిరాజు, కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయితీ వర్కర్స్, ఉపాధి హామీ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఉద్యోగ, కార్మికులు, రైతులు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఓరిగంటి నందీశ్వరుడు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తులసి, ఆకుల రమాబాయ్, లక్ష్మి, ఆశ యూనియన్ నాయకులు వడ్డీ వెంకటలక్ష్మి, ఉమాదేవి, సత్యవతి, ఇందిరాదుర్గ, పాల్గొన్నారు.


కాజులూరులో కూలీలతో మాట్లాడుతున్న రాజబాబు


గొల్లప్రోలులో మాట్లాడుతున్న సత్తిరాజు

3వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహి స్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేద న్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగేశ్వరరావు, కె.వెంకట రమణ, కోశాధికారి ఐ. శ్రీనివాస అయ్యప్పస్వామి, ఎన్.సూర్యప్రకాశ రావు, ఎస్.సత్తిరాజు, పి.ప్రశాం త్, ఎం.పాపారావు, వి.భాస్కరరావు పాల్గొన్నారు.


సమ్మె చేస్తున్న కార్మికులు

ప్రేమ పేరుతో మోసం : యువతి ఆత్మహత్య

ఆసుపత్రి వద్ద కుటుంబికుల ఆందోళన

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

మండలంలోని ఒక ప్రయివేటు కళాశాల వసతి గృహంలో వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న రౌతులపూడి మండలం మెరక చామవరంకు చెందిన నిండుకుండల నాగవల్లిక గురువారం అర్ధరాత్రి సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ శివనాగు సిబ్బందితో సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించారు. పంచనామా నిర్వహించి ఆమె మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మాట్లాడుతూ వార్డెన్ నాగవల్లిక, అదే గ్రామానికి చెందిన శెట్టిబత్తుల శివదుర్గ ప్రేమించుకున్నారు. అయితే వివాహం చేసుకోవడానికి శివదుర్గ నిరాకరించడంతో మనస్థాపానికి గురియైన ఆమె ఉంటున్న రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె తల్లి నిండికొండల దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రాస్తారోకో నిర్వహిస్తున్న కుటుంబీకులు(ఇన్‌సెట్లో మృతిరాలు)

ఆసుపత్రి వద్ద రాస్తారోకో

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి రహదారిపై వార్డెన్ నాగవల్లిక కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. రాత్రి ఫోన్‌లో వీడియో కాల్ చేసి తమతో మాట్లాడిందని, ఉదయానికి ఆమె మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగమల్లిక మతిపై విచారణ జరిపి ఆమె మతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆదర్శనీయులు మల్లాడి శివరామనాయకర్

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎస్ఎన్ చారిటీస్ మాజీ ఛైర్మన్ మల్లాడి శివరామనాయకర్ అందరికీ ఆదర్శనీయులని ఎంఎస్ఎన్ చారిటీస్ కార్యనిర్వాహణాధికారి, ఎసి కె.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఎస్ఎన్ చారిటీస్ కార్యాల యంలో శివరామనాయకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి ఆయన అంకితభావంతో కృషి చేశారన్నారు. ఆయన ఆలోచనలు, విలువలు సంస్థ ధ్యేయాన్ని నిరంతరం ముందుకు నడిపిస్తూనే ఉంటాయని అన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఎంఎస్ఎన్ చారిటీస్ సిబ్బంది శ్రద్ధాంజలిని ఘటించారు.


నాయకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

10న అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

భారతీయ విద్యా భవన్స్‌పై ఈ నెల 10న స్థానిక డి కన్వెన్షన్ సెంటర్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కాకినాడ కేంద్ర భారతీయ విద్యా భవన కార్యదర్శి యు.కాశీవిశ్వనాథరాజు, ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు ఆనందరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక వత్సవాయి భవనంలో వారు మీడియాతో మాట్లాడారు. సిబిఐ విశ్రాంత జెడి వివి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ఎంఎల్ఎ చినరాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల బాబు, భవన్ వైస్ ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, భారతీయ విద్యా భవన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాజా సూరిబాబురాజు, కేరళ ఫిషరీస్ విశ్రాంత వైస్ ఛాన్సలర్ మోహన్ కుమారన్‌నాయర్ పాల్గొంటారని తెలిపారు.

సంఘసంస్కర్త దుర్గాబాయి దేశముఖ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళిక సంఘ సభ్యురాలిగా సేవలు అందించిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘసంస్కర్తగా నిలిచారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జిఎం ప్రసాద్ నాయుడు అన్నారు. శుక్రవారం అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో ఆమె వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె బాల్యం నుంచి ప్రతిభాపాటవాలను కనపరిచేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిటీని నియమించాలి

ప్రజాశక్తి - కాకినాడ

12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, విద్యాశాఖలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఫిలిప్‌రాజు, ఎన్.శ్రీనివాస్ మాట్లాడారు. ఒకటి నుంచి 5వ తరగతులను మోడల్ లేక బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగానే కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలకి సంఖ్యతో సంబంధం లేకుండా కనీసం రెండు ఎస్‌జిటి పోస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గోరస దుర్గాప్రసాద్, నాయకులు వి.శ్రీరామ్, కెఎస్.సుబ్రహ్మణ్యం, బి.సత్యప్రసాద్, బి.శ్రీనివాస్, ఏసుబాబు, అప్పారావు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ ప్రజల నుంచి వినతులను స్వీకరిం చారు. ఆయా వినతులను ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప ద్వారా ఆయా శాఖల అధి కారులకు పంపించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్య క్రమంలో నాయకులు నూనె రామారావు, బలుసు వాసు, బొందల రామలక్ష్మి, గుడాల శంకర్, వల్లూరి గాంధీ, త్రిమూర్తులు, మల్లిరెడ్డి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు

కార్టూ'నిజం'



శ్రీప్రకాశ్‌లో క్యాంపు ముగింపు

ప్రజాశక్తి - తుని

గత 15 రోజులుగా శ్రీ ప్రకాష్‌లో విద్యార్థులకు జరుగుతున్న సమ్మర్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. ఈ సమ్మర్ క్యాంపులో యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్ట్ క్రాఫ్ట్, సంగీతం, స్కేటింగ్, కంప్యూటర్ బేసిక్స్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, ఖో-ఖో, వాలీ బాల్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్ తదితర అంశాలపై నిష్ణాతులైన కోచ్‌లతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సభలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న ప్రతీ ఏడాది సమ్మర్ క్యాంపును నిర్వహించి విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులకు ఆసక్తిని పెంచుతున్నట్లు తెలిపారు. క్రీడలకు తమ విద్యా సంస్థ ఎల్లప్పుడూ తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రోజూ ఒక గంట సమయాన్ని వ్యాయామం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యతో పాటుగా ఆటలకు తమ విద్యా సంస్థలు ఇస్తున్న ప్రాధాన్యత ద్వారానే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయాలను సొంతం చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో శ్రీప్రకాష్ సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్


హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య

విద్యార్థుల నమోదు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని వేట్లపాలెం, మాధవపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, స్థానిక ఎస్‌టిజికె ఉన్నత పాఠశాల, సామర్లకోట క్లస్టర్ పాఠశాల హెచ్‌ఎంలు, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలతో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల హెచ్‌ఎం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసుకుని, ప్రతిరోజు ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఏరోజు కారోజు పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను క్లస్టర్ పాఠశాలల హెచ్‌ఎంలకు తెలియచేయాలన్నారు. అంగన్‌వాడీ పరిధిలోని 5 ప్లస్ వయసు నిండిన విద్యార్థులను పాఠశాలలో వెంటనే చేర్చుకుని ఆ వివరాలను హెచ్‌ఎంలకు తెలియచేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అనురాధ, గోవింద రాజులు, ఎల్.ప్రసున్న, తాండ్ర శ్యామ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కరప

ఒక వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాలు ప్రకారం... గొర్రిపూడి గ్రామానికి చెందిన యర్రంనీడి సత్య నూకరాజు (69) మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ నెల గురువారం రాత్రి 7 గంటలకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం 6 గంటలకు రోడ్డు ప్రక్కన నూకరాజు తలకు తీవ్ర గాయమై పడి ఉండడాన్ని గ్రామానికి చెందిన ఒంటె వీరగణేష్ గమనించాడు. మృతుని కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తన తండ్రిని ఏదో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని మృతిని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో... వెండి, బంగారం చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తాళం వేసిన ఇంట్లో వెండి, బంగారం వస్తువులు చోరీ అయ్యాయి. ఈ ఘటన మండలంలోని అన్నంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిలంకలో చోటు చేసుకుంది. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని లక్ష్మీదేవిలంకకు చెందిన కడలి పద్మావతి బుధవారం సామర్లకోట బంధువులు ఇంటికి వెళ్లింది. శుక్రవారం పద్మావతి ఇంటి దగ్గర పెట్టిన బండిని తీసుకు వెళ్లేందుకు ఆమె మరిది హేమరాజు వెళ్లాడు. అయితే ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో ఆ విషయాన్ని పద్మావతికి చెప్పాడు. అతను ఇంటి వెనకకు వెళ్లి చూడగా తలుపులు తాళాలు తెరిచి ఉండడాన్ని చూసి విషయాన్ని పద్మావతికి తెలిపాడు. దీంతో పద్మావతి వచ్చి చూడగా బీరువా తాళాలు తెరిచి ఉన్నాయి. బీరువాలో 55 గ్రాములు బంగారం, 39 తులాలు వెండి, రూ.20,000 నగదు అపరించకపోయినట్లు గుర్తించారు. దీంతో విషయాన్ని పోలీసు ఫిర్యాదు చేయగా సిఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఎంఎల్‌సిని క్షమాపణ కోరిన ఇఒ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవంలో ఎంఎల్‌సి అనంతబాబుకు ముత్యాల తలంబ్రాలు ఇవ్వడంలో దేవస్థానం అధికారి అలసత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారి చేసిన అలసత్వానికి ఇఒ పేర్ల సుబ్బారావు ఆయనను క్షమాపణ కోరారు.

12న పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 12న స్థానిక పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని పాడీ పీడీ చైత్రవర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు.

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత సైన్యం పాకిస్థాన్‌పై సాగిస్తున్న యుద్ధం ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మండలం లోని హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ర్యాలీ ఏర్పాటు చేశారు. భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తూ ఆపరేషన్ సిందూర్‌కు సెల్యూట్ చేస్తూ, జయహో భారత్, పాకిస్తాన్ ఉగ్రవాదులు నశించాలని నినాదాలు చేస్తూ గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గామ్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల చేసిన దాడులకు ప్రతీకారంగా మహిళా ఆర్మీ నాయకత్వంలో చేసిన ఆపరేషన్ సింధూర్ విజయవంత మైందన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను ధ్వం సం చేసిన మహిళా ఆర్మీ నాయకత్వాన్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ నరహరశెట్టి సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా, రెవెన్యూ సిబ్బంది, ఉపాధి హామీ కార్మికులు, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీ

ప్రజాశక్తి - మండపేట

మండపేట మండలం జెడ్.మేడపాడు వంతెన సమీపంలో గురువారం రాత్రి మండపేట రూరల్ సిఐ దొరరాజు ఆధ్వర్యంలో వాహనాలు విస్తృత తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ దొరరాజు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్.బుచ్చిబాబు, తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశామన్నారు. అనుమానిత వ్యక్తులు, అనుమానిత వాహనాలు, అనుమానిత పదార్థాలపై తనిఖీలు చేశామన్నారు. ఐదుగురు వ్యక్తుల పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే అంగర, రాయవరం స్టేషన్ ల పరిధిలో పలు కేసులను నమోదు చేసినట్లు సిఐ దొరరాజు తెలిపారు.

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మద్యం తరలిస్తూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం పాట ద్వారా రూ.1.50లక్షల ఆదాయం రాబడి వచ్చిందని ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌ఛార్జ్ సిఐ రవితేజ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సజ్ డిప్యూటీ కమిషనర్ కమీషనర్ వారి ఆదేశాల మేరకు అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 8 వాహనాలకు వేలం నిర్వహించగా, 6 వాహనాల ద్వారా రూ.1, 27,500 రాగా, జిఎస్టి రూ.22,950 రూ. మొత్తం రూ.1,50,450 ఆదాయం సమాకూరినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఘనంగా అరుంధతీ నక్షత్ర దర్శనం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు సాంప్రదాయ రీతిలో అధికారులు అరుంధతీ నక్షత్ర దర్శనం నిర్వహించారు. ప్రధానాలయంలో ప్రత్యేక వైదిక తతంగం చేపట్టిన అర్చకస్వాములు రాత్రి 7 గంటలకు స్వామి, అమ్మవార్లకు వధూవరులకు శాస్త్రోక్తంగా అరుంధతీ నక్షత్ర దర్శనం గావించారు. అనంతరం కొండ దిగున రాత్రి 9 గంటలకు విద్యుత్ దీపకాంతులతో అలంకరించిన రావణ వాహనంపై ఆలయ ఛైర్మన్ రాజా ఐవి.రోహిత్, ఇఒ సుబ్బారావు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోలాటాలు, బ్యాండ్ మేళాలు, విచిత్రవేషధారణలు, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు యాత్రికులను అలరించాయి


ఊరేగింపులో దేవస్థానం ఛైర్మన్, ఇఒలు

ప్రమాదాలపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రసాయన పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే సమీప ప్రాంతాల్లోని ప్రజలు తీసుకోవాల్సిన భద్రతపై అవగాహన కపెంచాలని లోకల్ క్రైసిస్ గ్రూప్ ఛైర్మన్, ఆర్‌డిఒ కె.శ్రీరమణి అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్‌కార్యాలయంలో లోకల్ క్రైసెస్ గ్రూప్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన పరిశ్రమల్లో ఉన్న భద్రతా ఏర్పాట్లు సరిగా లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రతి రసాయన పరిశ్రమ ఆధ్వర్యంలో సమీప ప్రాంతాల్లోని ప్రజలకు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రవర్తనపై అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్ ఎవి.మురళీకృష్ణ, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీహరిజగన్నాథ్, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట ఫైర్ స్టేషన్ ఆఫీసర్లు కె.రాముడు, డి.రామకృష్ణరాజు, ఎస్.లక్ష్మణరావు, డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ శ్రీరమణి

ముగిసిన అకడమిక్ లీడర్‌షిప్ సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

అధ్యాపకుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఆదిత్యలో నిర్వహించిన ఐదు రోజుల సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు వేడుకలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో మార్పులు తీసుకురావడంలో అధ్యాపకుల పాత్ర ఎంత ముఖ్యమన్నారు. విద్యా నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి, పాలన విధానంలో పారదర్శకత, వ్యూహాత్మక ప్రణాళిక ద్వారా సంస్థ అభివృద్ధి, బోధనలో నూతన ఆవిష్కరణలు, నాణ్యత నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఐ.క్యూఎసి డీన్ డాక్టర్ జి.రామకృష్ణ, డాక్టర్ ఎంవి.రాజేష్, డాక్టర్ వానతి, వివిధ విభాగాధిపతులు, ఇతర ఫ్యాకల్టీ మెంటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


అధ్యాపకులతో శ్రీనివాసరెడ్డి, ఇతరులు

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో శుక్రవారం విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు గ్రామానికి చెందిన విద్యార్థులు విజ్ఞాన యాత్ర పేరుతో స్థానిక సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వహకులు బుద్ధా శ్రీనివాస్ వారికి ప్రయోగాలపై అవగాహన కల్పించారు. జంతు ప్రేమికుడు నవీన్‌నాని పాములపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ప్రతినిధులు కె.సునీత, ఆర్.అరుణ్‌కుమార్, మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు రాజేష్ కుమార్, సాయి, మణికంఠ, అఖిల, భాషా, హర్ష పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి ఉమర్ అలీషా

హ్యాండ్ రైటింగ్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠంలో నిర్వహిస్తున్న తాత్విక బాల వికాస్ వేసవి శిక్షణ తరగతుల్లో కెవిఎస్ఎస్.ప్రసాద్ స్వదస్తూరితో రాయబడిన ప్రసాద్ బ్యూటిఫుల్ ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ పుస్తకాన్ని పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ చేస్తున్న సేవలు గురించి, ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్‌లో గడించిన ఖ్యాతి గురించి పీఠాధిపతి అభినందించారు. తాత్విక బాలవికాస నందు చిన్నారులకు పలు అంశాలపై విజ్ఞానాన్ని కలిగిస్తూ తన సేవలను అందిస్తున్నారని కొనియాడారు. ప్రసాద్ మాట్లాడుతూ 9 గీతలు ప్రాక్టీస్ చేస్తే అక్షరాలు ఏర్పడతాయని, తరువాత కలిపే విధానం తెలుసుకుంటే పదాలు ఏర్పడతాయని, తద్వారా పదాలు వాక్యాలుగా మారతాయని తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా హ్యాండ్ రైటింగ్‌ని మార్చుకోగలమని, ఈ ప్రాక్టీస్ వల్ల బ్యూటిఫుల్ ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్ రాయగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎవివి.సత్యనారాయణ వర్మ, తటవర్తి సుబ్బారావు, ఎం.సత్యనారాయణ, మల్లి, జనార్ధన్, రమణమూర్తి, నాగేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఆదిత్య సిబ్బంది

ఆదిత్యలో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందికి ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటిని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ శ్రీ కిరణ్ నేత్ర శస్త్ర చికిత్సాలయం వైద్యులు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్ కొరకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలందించిన సిబ్బందిని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, రెడ్ క్రాస్ యూనిట్ కో.ఆర్డినేటర్ పి.శివకుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది బి.ప్రవీణ, క్యాంపు కో.ఆర్డినేటర్ పెదిరెడ్ల సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, పి.ప్రసాదరావు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా రాజారావు

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మేరుగు రాజారావు ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునితోపాటు, ప్రధాన కార్యదర్శిగా పిఆర్.ప్రసాదరావు, కోశాధికారిగా జి.రాజా, ఉపాధ్యక్షుడిగా ముమ్మిడి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా ముమ్మిడి శ్రీనివాస్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎంవివిఎన్. సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా జిఎస్.భాస్కరాచార్యులు, లేడీ రిప్రజంటేటివ్‌గా ఎం.సత్యవాణిశ్రీ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సరిదే నాగేశ్వరరావు, సిహెచ్.ప్రేమ్‌జీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రావుల రమేష్, జిపివి.సత్యనారాయణ, మహిళా సభ్యురాలిగా అల్లాడ గీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది బత్తిన లక్ష్మణదొర వ్యవహరించారు.


బార్ అసోసియేసన్ నూతన పాలకవర్గం

యానాం వార్తలు


కేంద్ర బృందానికి వివరిస్తున్న ఎంఎల్ఎ గొల్లపల్లి, మల్లాడి కృష్ణారావు

రక్షణగోడ నిర్మాణ ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

గోదావరి వరదలకు యానాం పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలను ముంపునుంచి రక్షించేందుకు అవసరమైన రక్షణగోడ నిర్మాణ ప్రాంతాలను శుక్రవారం కేంద్రప్రభుత్వ అధికారుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కనకాలపేట నుంచి నియోజకవర్గ శివారు తీరప్రాంత గ్రామం సావిత్రినగర్ వరకు రక్షణగోడ నిర్మాణానికి గతంలో పుదుచ్చేరి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో కేంద్ర ఉన్నతాధికారి ప్రభాస్ చంద్ర నేతృత్వంలో నిపుణుల బృందం గోదావరిలో ప్రత్యేకబోటులో పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పిడబ్ల్యూడి అధికారులు రక్షణగోడ ఆవశ్యకత, ప్రయోజనాలు, ఇతర విషయాలను కేంద్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, రెవెన్యూ, పిడబ్ల్యూడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసు అధికారి రాజారావు మృతి

ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన విశ్రాంత పోలీసు అధికారి మంచాల వెంకట మాచర రాజారావు శుక్రవారం మృతి చెందారు. 40 సంవత్సరాల పాటు పుదుచ్చేరి పోలీసుశాఖలో సుధీర్ఘంగా వివిధ హోదాల్లో సేవలందించిన రాజారావు సిఐగా 1986 జూన్ 30న ఆయన ఉద్యోగవిరమణ చేశారు. అయితే కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారు. స్థానిక నాయకులు, ప్రముఖులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, తదితరులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం ఆయన నివాసం నుంచి స్థానిక హిందూ శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించి అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. యానాం పోలీసులు అంతిమ సంస్కార ఫెరేడ్ జరిపి ఘనంగా నివాళి అర్పించారు. సిఐ అడరెల్సన్, ఎస్ఐ పునీత్‌రాజ్, తదితర పోలీసులు ఫెరేడ్‌లో పాల్గొన్నారు.

22న అసిస్టెంట్ పోస్టుల రెండో ఫేజ్ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న రెండవ ఫేజ్ పోటీ పరీక్ష ఈనెల 22న ఆదివారం ఉదయం నిర్వహిస్తున్నట్లు డిపి అండ్ ఎఆర్ కార్యదర్శి వి.జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న నిర్వహించిన టైర్-1 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు టైర్-2 పరీక్షను నిర్వహిస్తున్నామని, అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తాళ్లరేవు స్థానిక ప్రజాసంఘాల భవనంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఇంద్రజాల ప్రదర్శన విజ్ఞాన దాయకంగా సాగింది. పెద్దాపురంకి చెందిన సైన్స్ ఉపాధ్యా యులు బుద్ధ శ్రీనివాస్ చేసిన ఇంద్రజాల ప్రదర్శన విద్యా ర్థులను ఆకట్టుకుంది. విద్యార్థులకు విభాగాల వారి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శనివారం నిర్వహించే క్యాంపు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్, వెదురుపావులూరి నాని, చిట్టితల్లి, కొప్పిశెట్టి అనంతలక్ష్మి పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న బాలల సమ్మర్ క్యాంప్‌లో బాలలకు కరాటే, వ్యాయామం, పాటలు పాడటం, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు తెప్పల యోగేష్, లోకేష్, ఉపాధ్యాయురాలు బేబీరత్నం, గూనూరు వెంకటరమణ, బంగారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, కోశాధికారి కూనిరెడ్డి రవికుమార్, పవన్, సాయి, బంగారం, మణికంఠ, హర్ష, మహమ్మద్ భాషా, అంజలి, సత్య, లలిత, లావణ్య, ఆకాష్, మనోజ్ పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఇంద్రపాలెం చిల్డ్రన్స్ క్లబ్ (ఐసిసి) ఆధ్వర్యంలో చిన్నారుల సమ్మర్ క్యాంపు విఎస్ఆర్ ఐడియల్ స్టడీ సెంటర్‌లో కొనసాగుతోంది. ఈ క్యాంపులో డ్రాయింగ్, ఒరిగామి, సైన్స్ ప్రయోగాలు, స్నేక్స్‌పై అవగాహన, పాటలు, డాన్స్, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ క్యాంపులో డా.సురేంద్రబాబు, జి.శ్రీనివాస్, బలరామకృష్ణ, బుద్ధ శ్రీనివాస్, సత్యవేణి, తేజ, లోవరాజు, నాని శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐసిసి అధ్యక్ష, కార్యదర్శులు తక్ష, ప్రణీత, వైస్ ప్రెసిడెంట్లు జగత్, ఆనంద్, జాయింట్ సెక్రటరీలు లాస్య, నిక్సన్, కమిటీ సభ్యులు పాల్గొంటున్నారు.


పెద్దాపురంలో పాటలు పాడుతున్న చిన్నారులు


కాకినాడ రూరల్‌లో క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - మండపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యముగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ళ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతీ శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ప్రతీ అర్జీని పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి వాటి పై చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తామని ఎంఎల్ఎ వేగుళ్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.



మండపేటలో ప్రజల సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు

గ్రామాభివృద్ధిలో సర్పంచ్ సుభాష్ కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

పినపళ్ల గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడంతో పాటు రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు సాధనలో సర్పంచ్ సంగిత సుభాష్ కృషి ప్రశంసనీయం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, ఒఎన్‌జిసి ఇడి సంతాన దాస్ అన్నారు. మండలంలోని పినపళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒఎన్‌జిసి సహకారంతో శుక్రవారం చేపట్టిన పలు అభివృద్ధి పనులను వారు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుభాష్ అధ్యక్షతన జరిగిన సభలో బండారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో మును పెన్నడూ లేని విధంగా రాష్ట్ర స్థాయిలో పేదరిక నిర్మూలన, అందరికీ ఉపాధి కల్పన అనే అంశాలపై అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. ఈ గ్రామ ప్రతిష్టను జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన ఘనత సర్పంచ్ సుభాష్‌కే దక్కుతుందన్నారు. గ్రామాన్ని సుమారు రూ.1.98 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడమే కాకుండా పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించి అనేక మందికి ఉపాధి సౌకర్యాలు కల్పించడం, పారిశుధ్యం చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు సాధించిన సర్పంచ్ సుభాష్‌ను ఎంఎల్ఎ సత్యానందరావు, జనసేన నేత శ్రీనివాస్, ఒఎన్‌జిసి ఇడి సంతాను దాస్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సమక్షంలో మెమెంటో బహూకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సర్పంచ్ సుభాష్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు, తదితరులు